సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం। 21। మే। 2024



సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి
సింహగిరిపై ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. 8లో



కక్షిదారులకు న్యాయం 8లో
కక్షిదారులకు సత్వర న్యాయాన్ని అందించేందుకు మధ్యవర్తిత్వ విధానాన్ని పాటించాలని విశాఖ జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి కె.రాధారత్నం చెప్పారు.



స్వచ్ఛమైన పాల వెల్లువ 8లో
ప్రస్తుతం కల్తీ లేని ఉత్పత్తులు దొరకడం గగనంగా మారింది. ముఖ్యంగా పాల విషయంలో ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు



డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరు: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 1,118 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

వచ్చే నెల 1 నుంచి ఓపెన్ పరీక్షలు...
ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఎస్సెస్సీ సప్లిమెంటరీ, ఓపెన్ ఇంటర్ పరీక్షలను వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీఈవో బ్రహ్మాజీరావు తెలిపారు. ఓపెన్ టెన్త్‌కు 424 మంది, ఓపెన్ ఇంటర్‌కు 321 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామన్నారు. విద్యార్థులందరికీ సకాలంలో హాల్‌టికెట్లు అందజేసి ప్రతి ఒక్కరూ పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గురుకుల కళాశాలలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ రేపు

రంపచోడవరం: చింతూరు, రంపచోడవరం డివిజన్‌ల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఎనిమిది గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో సీట్ల భర్తీకి బుధవారం ఉదయం 9.00 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు సాధించిన మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బాలురకు రంపచోడవరం ఏపీఆర్ జూనియర్ కళాశాలలో, బాలికలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ మార్క్స్ లిస్టు, ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, రేషన్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కలిపి మొత్తం మూడు సెట్లు జిరాక్స్ తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్ ఎ.ప్రసూన 9490957243 సంప్రదించాలన్నారు.

ఒలింపిక్స్ దిశగా జ్యోతి పరుగు



భారత్ హార్డిలర్ జ్యోతి

విశాఖ స్పోర్ట్స్ : భారత హార్డిలర్ జ్యోతి ఎర్రాజీ అంతర్జాతీయ మీట్‌లో మరో స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. ఒలింపిక్స్‌కు అర్హత సాధించే దిశగా సాగుతున్న ఆమె ప్రయాణంలో ఈ స్వర్ణం దోహదపడనుంది. ఒలింపిక్స్‌లో అర్హత సాధించేందుకు వచ్చే 30వ తేదీలోగా మరో ఐదు అంతర్జాతీయ పోటీల్లో రాణించాల్సి ఉంది. విశాఖ నుంచి అంతర్జాతీయ స్థాయి అథ్లెట్స్‌గా భారత్ తరఫున నెదర్లాండ్స్‌లోని కుర్ఫ్‌పాల్జ్ గాలాలో జరిగిన వంద మీటర్ల హార్డిల్స్‌ను 13.06 సెకన్లలోనే పూర్తి చేసి విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకుంది. ఈనెల ప్రారంభంలోనే జరిగిన హారీ షుల్టింగ్ గేమ్స్‌లో విజయం సాధించిన తర్వాత మహిళల వంద మీటర్ల హార్డిల్స్‌లో ఈ మార్క్‌కి ఈ సంవత్సరంలో రెండో టైటిల్. ఈ ఈవెంట్‌లో 200 మీటర్ల టైమ్ ట్రయిల్స్ ఫైనల్‌లోనూ పోటీ పడి ఇద్దరు డచ్ అథ్లెట్స్ వెనుక 23.83 సెకన్ల సమయంలో పూర్తి చేసి మూడవ స్థానంలో నిలిచింది.

మెడికల సాకారం

గిరిజన సిగలో మరో కలికితురాయి చేరనుంది. పాడేరు జిల్లా కేంద్రంగా వైద్య కళాశాల ఏర్పాటుతో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. త్వరలో ఎన్‌ఎంసీ బృందం పరిశీలన పూర్తయితే జూలై నుంచే వైద్య విద్య ప్రారంభమవుతుంది. దీంతోపాటు వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న గిరిజనుల కల సాకారం కానుంది.

- జూలై నుంచి వైద్య విద్య ప్రారంభానికి చర్యలు
- త్వరలో ఎన్‌ఎంసీ పరిశీలన
- జోరుగా మెడికల్ కళాశాల పనులు
- రూ.500 కోట్లతో పాడేరులో నిర్మాణం
- మిగిలిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఇతర భవనాలకు గడువు
- గిరిజనులకు ఉన్నత వైద్యం, వైద్య విద్య సీఎం జగన్ లక్ష్యం



నిర్మాణంలో మెడికల్ కళాశాలకు అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనం

సాక్షి, పాడేరు: స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందని ద్రాక్షగానే మిగిలింది. ఎందరో పాలకులు గిరిజనుల వైద్యాన్ని పట్టించుకోలేదు. గిరిజనులకు ఉన్నత వైద్యమంటే వందల కిలోమీటర్ల దూరంలో విశాఖ కేజీహెచ్‌యే దిక్కు. అక్కడకి అత్యవసర వైద్యానికి రోగులను తరలించేలోపు ప్రాణాలు గాలిలో కలిసిపోయిన విషాదకర సంఘటనలు అనేకం. కనీసం వ్యాధి నిర్ధారణకు అతీగతీ లేని దుస్థితి. గిరిజనుల పక్షపాతిగా పేరొందిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో 2019 ఎన్నికల ప్రచారానికి పాడేరు విచ్చేసి మెడికల్ కళాశాల మంజూరు చేస్తామని, గిరిజనులకు ఉన్నత వైద్యంతోపాటు వైద్య విద్య అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాడేరులో మెడికల్ కళాశాలకు 35 ఎకరాల స్థలం సేకరించడం, వెన్వెంటనే రూ.500 కోట్లు మంజూరు చేశారు. గిరిజనుల వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిచ్చి మన్యం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా చర్యలు తీసుకున్నారు.

చురుగ్గా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు
పాడేరు పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలో 35 ఎకరాల విస్తీర్ణంలో మూడు బ్లాక్‌లలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కరోనా మహమ్మారి కారణంగా ఏడాది పాటు మెడికల్ కళాశాల నిర్మాణ పనులకు జాప్యం జరిగింది. మరోవైపు ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఇక్కడ అన్ని విభాగాల సిబ్బంది మెడికల్ కళాశాల నిర్మాణ పనులను చేపడుతున్నారు. ప్రభుత్వం మరో ఏడాది గడువు పెంచడంతో ఈ ఏడాది చివరి నాటికి మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేసే లక్ష్యంతో ఎన్‌సీసీ నిర్మాణ సంస్థ పని చేస్తోంది.

మూడు బ్లాక్‌ల పనులు
మెడికల్ కళాశాలను మూడు బ్లాక్‌లుగా విభజించి భవన నిర్మాణ పనులను చేపడుతున్నారు. మెడికల్ కళాశాల, 420 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల సిబ్బంది నివాసాలకు మొత్తం మూడు బ్లాక్‌ల్లో భవన నిర్మాణ పనులు శరవేగంతో జరుగుతున్నాయి. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ భవన నిర్మాణాలను చూస్తున్న అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

జూలైలో మెడికల్ కళాశాల ప్రారంభం
ఇప్పటికే పాడేరులో వైద్య కళాశాలకు ప్రిన్సిపాల్‌తో పాటు 11 మంది ప్రొఫెసర్లు, 16 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 32 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను నియమించారు. వారంతా పాడేరు జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. తాత్కాలికంగా పాడేరు జిల్లా ఆస్పత్రిలో 420 బెడ్‌లను ఏర్పాటు చేసి గిరిజనులకు ఉన్నత వైద్య సేవలను అందిస్తున్నారు. అయితే జాతీయ మెడికల్ కౌన్సిల్ పరిశీలన పూర్తయిన వెంటనే వైద్య కళాశాలను కూడా ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లను పూర్తి చేశారు. జూలై నాటికి వైద్య కళాశాలలోని కొన్ని విభాగాలను పూర్తి చేసి అప్పగిస్తామని ఎన్‌సీసీ నిర్మాణ సంస్థ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీంతో వైద్య విద్య కూడా జూలై నుంచి ప్రారంభం కానుంది.



నిర్మాణంలో మెడికల్ కళాశాల భవనం



నిర్మాణంలో మెడికల్ కళాశాల అనుబంధ నర్సింగ్ కళాశాల భవనం

జాతీయ మెడికల్ కౌన్సిల్ పరిశీలనకు ఏర్పాట్లు



పాడేరులో మెడికల్ కళాశాల నిర్మాణం చారిత్రాత్మకమే. ఈ ప్రాంతానికి చెందిన గిరిజన వైద్యురాలిగా పాడేరు మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులవ్వడం గర్వంగా ఉంది. మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. పాడేరు జిల్లా ఆస్పత్రిలో 420 బెడ్‌లు, ఆపరేషన్ థియేటర్లను సిద్ధం చేశాం. జాతీయ మెడికల్ కౌన్సిల్ పరిశీలన కోసం ఎదురు చూస్తున్నాం. ఎన్‌ఎంసీ బృందం పరిశీలన పూర్తయితే జూలై నుంచే వైద్య విద్య కూడా ప్రారంభమయ్యే అవకాశం ఉంది.
– డాక్టర్ హేమలతాదేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, పాడేరు

24న ఎంఎస్‌ఎంఈ వర్క్‌షాప్

గోపాలపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ నెల 24న ఎంఎస్‌ఎంఈ మేక్ ఇన్ ఇండియా సపోర్టు స్టార్టప్ అండ్ అగ్రిటెక్, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్, డీజీఎస్ సంతోష్ కుమార్ సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రం టీటీడీసీలో ఈ వర్క్‌షాప్ జరుగుతుందని పేర్కొన్నారు. సపోర్టింగ్ హ్యాండ్ హోల్డింగ్ గైడెన్స్, రూ.5 కోట్ల వరకూ రుణ సదుపాయం పొందడంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23వ తేదీలోగా పెందుర్తి ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకు 98667 93111, 99630 45222 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇసుక అక్రమ రవాణా కాకుండా చర్యలు

- పరిశీలించిన కలెక్టర్ విజయ సునీత



ఇసుక రీచ్‌లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఉన్నతాధికారులు

ఎటపాక: మండలంలోని ఇసుక రీచ్‌లను కలెక్టర్ విజయ సునీత సోమవారం పరిశీలించారు. సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇక్కడ నాలుగు ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు. గొమ్ముకొత్తగూడెం, రాయనపేట, గుండాల, కన్నాయిగూడెం వద్ద గోదావరి నది నుంచి ఇసుక అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలని మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆమె ఆదేశించారు. రీచ్‌ల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శేఖర్, మైనింగ్, పోలీస్ శాఖ అధికారులు ఉన్నారు.

కార్గో సేవలు మరింత విస్తృతం

- పాఠ్య పుస్తకాలు, విత్తనాలు సైతం..
- ఆర్టీసీ లాజిస్టిక్స్ బస్సుల ద్వారా రవాణా
- జూన్ తొలి వారానికి ముందే పుస్తకాల పంపిణీ
- జూన్ ఆఖరి వరకు విత్తనాల సరఫరాకు సన్నాహాలు
- రూ.కోటి ఆదాయం సమకూరుతుందని అంచనా



ఆర్టీసీ లాజిస్టిక్స్ వాహనంలోకి పుస్తకాలు లోడ్ చేస్తున్న సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: ఒకపక్క పాఠశాలలు తెరుచుకునే సమయం ఆసన్నమవుతోంది. మరోపక్క ఖరీఫ్ సీజను సమీపిస్తోంది. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ కార్గో సేవలకు సిద్ధమవుతోంది. గతంలో ప్రైవేటు సంస్థలు, వాహనాల ద్వారా వీటి సరఫరా జరిగేది. ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో గతేడాది నుంచి ప్రభుత్వం వీటి సరఫరాను కార్గో విభాగానికి అప్పగించింది. ఈ ఏడాది కూడా ఆర్టీసీ ఆ బాధ్యతలో పాలు పంచుకుంటోంది. తాజాగా ఆ ప్రక్రియను చేపట్టింది. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల ఆర్టీసీ జోన్–1 పరిధిలో 38 డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు (డీజీటీ–లాజిస్టిక్స్) వాహనాలు ఉన్నాయి. ఇప్పుడు వీటి ద్వారా బడి పిల్లలకు అవసరమయ్యే పాఠ్య, నోట్ పుస్తకాల సరఫరాకు శ్రీకారం చుట్టింది. వీటిని జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు లాజిస్టిక్స్ వాహనాల్లో తరలిస్తున్నారు. అక్కడ నుంచి సంబంధిత అధికారులు పాఠశాలలకు చేరవేస్తారు. వాటిని వారు బడి పిల్లలకు పంపిణీ చేస్తారు. ఇలా ఉత్తరాంధ్ర జిల్లాల్లో నెలాఖరు లేదా జూన్ మొదటి వారంలోగా లాజిస్టిక్స్ వాహనాల్లో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కుల రవాణా ప్రక్రియను పూర్తి చేయనున్నారు. మరోవైపు ఖరీఫ్ సీజను కూడా మరో నెల రోజుల్లో ప్రారంభం కానుంది. దీంతో రైతులకు అవసరమైన విత్తనాలను కూడా ఈ ఆర్టీసీ కార్గో సర్వీసుల ద్వారానే రవాణా చేయనున్నారు. ఏపీ సీడ్స్ సంస్థ ఇప్పటికే అవసరమైన విత్తనాలను సిద్ధం చేసింది. వీటిని జిల్లా కేంద్రాల నుంచి వివిధ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేల)కు ఆర్టీసీ లాజిస్టిక్స్ వాహనాల్లో తరలించనున్నారు. విత్తనాల తరలింపు కార్యక్రమాన్ని జూన్ నెలాఖరు వరకు చేపట్టనున్నారు.

రూ.కోటి ఆదాయం వచ్చే అవకాశం
గత సంవత్సరం కార్గో విభాగం ద్వారా విత్తనాలు, పాఠ్య పుస్తకాల రవాణా ద్వారా ఆర్టీసీ జోన్–1కు రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది అది రెట్టింపు అంటే రూ.కోటి వరకు వస్తుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులతో పాటు రైతులకు అవసరమయ్యే వివిధ రకాల విత్తనాల రవాణా ప్రక్రియను ఆదివారం నుంచి చేపట్టామని ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఓఅండ్‌సీ) బి.అప్పలనాయుడు 'సాక్షి'కి చెప్పారు.

మావోయిస్టు యాక్షన్ టీం సంచారంపై అప్రమత్తం

- ఏవోబీలో విస్తృతంగా పోలీసుల తనిఖీలు



ముంచంగిపుట్టులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: మావోయిస్టుల యాక్షన్ టీంల సంచారంపై సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దులో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో సోమవారం మారుమూల గ్రామాల నుంచి వచ్చే వాహనాలతోపాటు ఒడిశా నుంచి ఆంధ్రలోకి ప్రవేశించే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తూ అనుమానితులను ప్రశ్నించి విడిచి పెడుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లోనూ సోదాలు చేసి ప్రయాణికుల వివరాలను సేకరిస్తున్నారు. ముఖ్యంగా గుర్తింపు కార్డులను చూసి విడిచి పెడుతున్నారు. అటు ఒడిశా పోలీసులు సైతం జోలాపుట్టు, ఒనకఢిల్లీ, మాచ్‌ఖండ్ గ్రామాల్లో తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు సంచరిస్తే వెంటనే సమాచారం అందించాలని, పరిచయం లేని వారికి ఆశ్రయం కల్పించవద్దని, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీలలో ముంచంగిపుట్టు పోలీసులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు

- కలెక్టర్ విజయసునీత



రంపచోడవరంలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

రంపచోడవరం: వచ్చే నెల 4వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయని కలెక్టర్ ఎం. విజయ సునీత తెలిపారు. రంపచోడవరం గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో అసెంబ్లీ, పార్లమెంటుకు వేర్వేరుగా ఏర్పాటు పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చే అధికారులకు సిబ్బందికి అసెంబ్లీకి, పార్లమెంటుకు ఓట్లు లెక్కింపునకు సంబంధించిన కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు అయ్యేంత వరకు స్ట్రాంగ్ రూమ్ దగ్గరకు ఇతరులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. 24 గంటల భద్రతతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లు ఉన్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట రంపచోడవరం ఆర్వో ఎస్. ప్రశాంత్‌కుమార్, తహసీల్దార్లు కృష్ణజ్యోతి, రమణ, నాగరాజు తదితరులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న పాడేరు ఆర్వో భావన వశిష్ట



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను జాయింట్ కలెక్టర్, పాడేరు అసెంబ్లీ ఆర్వో భావన వశిష్ట, ఐటీడీఏ పీవో, అరకు అసెంబ్లీ ఆర్వో వి. అభిషేక్ వేర్వేరుగా పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం వారు పరిశీలించి నిరంతరం సక్రమంగా పని చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల బయట గస్తీ కాస్తున్న భద్రత సిబ్బంది నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనధికార వ్యక్తులు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. బయట వ్యక్తులు ప్రాంగణంలో ప్రవేశించకుండా నియంత్రించాలన్నారు. అనంతరం అక్కడ ఉన్న లాంగ్ బుక్‌పై సంతకాలు చేశారు. వారి వెంట రెవెన్యూ శాఖ జిల్లా అధికారులు ఉన్నారు.

కంచే చేను మేస్తే..!



బాలరేవుల-కొత్తపల్లి రహదారిలో నరికి వేసిన చెట్ల మొదళ్లు

- అక్రమార్కులతో చేతులు కలుపుతున్న అటవీ సిబ్బంది
- విలువైన కలప, చెట్లు మాయం
- సోలాబులో అక్రమంగా 40 టేకు చెట్ల తరలింపు
- టేకు, మారుజాతి చెట్ల మాయంపై స్క్వాడ్ తనిఖీలు

కొయ్యూరు: విలువైన అటవీ సంపదపై గొడ్డలి వేటు పడుతోంది. రాత్రిళ్లు అక్రమంగా తరలిపోతోంది. దీన్ని పరిరక్షించాల్సిన ఆ శాఖ అధికారులు అమ్యామ్యాల మత్తులో జోగుతున్నారు. చేయి తడిపితే చాలు ఎంత విలువైన కలప సరుక్కుని పోయినా అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదని కొయ్యూరు సెక్షన్‌లో ఇద్దరు బీట్ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల కిందట అటవీ స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందర్ ఆధ్వర్యంలో బృందం శరభన్నపాలెం, గంపరాయి, వైఎం సింగధార, సోలాబు, కొత్తపల్లి, గొల్లువలసలో తనిఖీలు చేసింది. ఈ బృందం తర్వాత చింతపల్లి డీఎఫ్‌వో ఆధ్వర్యంలో సోదాలు చేశారు. ఆపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఒక బీట్ అధికారి తన బీట్ కాకపోయినా, ఇతర బీట్‌ల్లోకి వెళ్లి అక్కడ స్మగ్లర్లతో చేతులు కలిపి కలప తరలించారన్న దానిపై విచారణ నిర్వహించారు.

అటవీ సిబ్బంది సహకారంతోనే..
రెండేళ్లుగా కలప అక్రమ రవాణా భారీగా పెరిగిపోయింది. అక్రమార్కులకు అటవీ సిబ్బంది సహకారం దండిగా ఉండటంతో అడవి ఖాళీ అవుతుంది. కొత్తగా వచ్చిన సిబ్బంది అడవిని కాయడానికి బదులు అమ్ముతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్క్వాడ్ డీఎఫ్‌వో, విజిలెన్స్ అధికారులు తనిఖీల్లో బయటపడిన కొన్ని అంశాలు...

- కాకరపాడు బీట్ సోలాబులో 21 టేకు చెట్లతో మారుజాతి చెట్లు మాయం అయ్యాయని స్క్వాడ్ డీఎఫ్‌వో నిర్ధారించారు. దీని అనంతరం వచ్చిన విజిలెన్స్ అధికారులు మొత్తం పాతవి, కొత్తవి కలిపి 40 చెట్లు మాయమయ్యాయని గుర్తించారు.
- బూదరాళ్ల పంచాయతీ కొత్తపల్లి సమీపంలో 140 మారుజాతి చెట్లు మాయం అయ్యాయని నిర్ధారించారు. దీనికి సిబ్బంది నిర్లక్ష్యంగా తేల్చారు. మొదళ్లను పరిశీలించి నివేదిక తయారు చేశారు.
- ఇదే పంచాయతీ గొల్లువలసలో నరికిన 106 చెట్ల మొదళ్లను కనుగొన్నారు. ఇంత ఎత్తున అడవి నాశనం కావడానికి ఇక్కడ సెక్షన్ అధికారి నుంచి రేంజర్ వరకు కారకులని అటు స్క్వాడ్ డీఎఫ్‌వో నుంచి ఇటు విజిలెన్స్ వరకు నివేదికలు తయారు చేసి చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు సమర్పించారు.
- కొయ్యూరు సెక్షన్‌కు చెందిన ఒక ఎఫ్‌బీవో శరభన్నపాలెం, బంగారంపేట సెక్షన్లలో మారుజాతి కలప లోడ్‌లను డబ్బులు తీసుకుని అధికంగా పంపించారని గుర్తించారు. మల్బరి చెట్లను అడవి నుంచి కొట్టిస్తే, వాటిని రైతుల పొలాల్లోనివిగా చూపించారని నిర్ధారించారు. ఇలా వైఎం. సింగధార, గంపరాయి, శరభన్నపాలెం ప్రాంతాల నుంచి ఆ చెట్లను నరికి పట్టుకుపోయారు.



గొల్లువలసలో నరికిన చెట్ల మొదళ్లు

చర్యలు తీసుకుంటాం



కొయ్యూరు సెక్షన్లో బీట్ అధికారిపై ఎక్కువగా ఆరోపణలున్నాయి. ఆయన పరిధి కాకపోయినా ఇతర బీట్లలోకి వెళ్లి స్మగ్లర్లకు అండగా నిలిచారని నిర్ధారణ అయింది. అతనిపై చర్యలకు ఉపక్రమిస్తాం. అదేవిధంగా ఇతర సిబ్బందిపైనా చర్యలు తీసుకుంటాం.
– సూర్యనారాయణ పడాల్, డీఎఫ్‌వో, చింతపల్లి

అష్టోత్తర శతనామావళి పరోక్ష సేవకు విశేష స్పందన



పోస్టల్ ద్వారా భక్తులకు పంపించేందుకు సిద్ధం చేసిన ప్యాకెట్లు

సింహాచలం : ఈనెల 10న సింహగిరిపై జరిగిన చందనోత్సవం సందర్భంగా ఆరోజు పరోక్షంగా స్వామికి నిర్వహించిన అష్టోత్తరసేవకు భక్తుల నుంచి విశేషంగా స్పందన లభించింది. మొత్తం 592 మంది భక్తులు రూ.1116 టికెట్లు తీసుకుని పరోక్షంగా అష్టోత్తరపూజను స్వామికి జరిపించారు. వీరందరికీ పోస్టల్ ద్వారా కుంకుమ, చందనం ప్రసాదం, ఆలయ చరిత్ర కరపత్రం, డ్రైఫ్రూట్స్‌ను పంపించే ఏర్పాట్లను సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు చేస్తున్నారు. ఇప్పటికే ప్యాకెట్ల రూపంలో వాటిని సిద్ధం చేస్తున్నారు.

ఏయూలో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలో ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ హోమ్ సైన్స్, ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఎమ్మెస్సీ న్యూక్లియర్ ఫిజిక్స్ మొదటి సంవత్సరం, మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఫిబ్రవరి నెలలో జరిగిన పరీక్షల ఫలితాలను విడుదల చేసి వెబ్‌సైట్‌లో ఉంచారు.
- ఆర్ట్స్ కళాశాల పరిధిలోని జర్మన్, ఫ్రెంచ్, ఫోటోగ్రఫీ డిప్లమా కోర్సుల పరీక్షల ఫలితాలు విడుదల చేశారు.
- ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో బీటెక్ ఆరో సెమిస్టర్, రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు.

మధ్యవర్తిత్వంతో కక్షిదారులకు న్యాయం


హాజరైన న్యాయమూర్తులు, వివిధ శాఖల అధికారులు

విశాఖ లీగల్ : కక్షిదారులకు సత్వర న్యాయాన్ని అందించేందుకు మధ్యవర్తిత్వ విధానాన్ని పాటించాలని విశాఖ జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి కె.రాధారత్నం చెప్పారు. సోమవారం జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలో న్యాయమూర్తులు సమావేశ మందిరంలో భారత సర్వోన్నత న్యాయస్థానం మీడియేషన్ కన్సిలేషన్ ప్రాజెక్ట్ కమిటీ(ఎంసీపీసీ), రాష్ట్ర హైకోర్టు మీడియేషన్ కమిటీ, విశాఖ జిల్లా న్యాయ సేవప్రాదికార సంస్థ సంయుక్తంగా మీడియేషన్ కన్సిలేషన్‌పై 40 గంటల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వ విధానం ఎంతో అవసరమన్నారు. సత్వర న్యాయంతో పాటు శాశ్వత ఫలితాలు అందించే దిశగా న్యాయస్థానాలు పాటిస్తే మంచిదని ఆమె సూచించారు. సుప్రీంకోర్ట్ మీడియేషన్ కన్సిలియేషన్ ప్రాజెక్ట్ జాతీయ శిక్షకులు వీకే బన్సాల్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మీడియేషన్ విధానం అవలంబించడం వల్ల కోర్టులో కేసులు సత్వరం పరిష్కారం అవుతాయన్నారు. దీనివల్ల భవిష్యత్తులో న్యాయస్థానాలపై భారం తగ్గే అవకాశం ఉందన్నారు. మరో శిక్షకుడు సునీల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ న్యాయవాదులు న్యాయమూర్తులు మధ్యవర్తిత్వం, సంప్రదింపులు విధానం అలవర్చుకోవడం వల్ల న్యాయ వ్యవస్థకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కోర్టులో కేసులు వేసిన వెంటనే మధ్యవర్తి విధానం అవలంబిస్తే ప్రాథమిక దశలోనే చాలా కేసులు రాజీ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 29 మంది న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ శిక్షణ మరో నాలుగు రోజులు పాటు కొనసాగనుంది.

అప్పన్న దాసుడొచ్చాడు

- సింహగిరికి వచ్చిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్
- మూడు నెలలపాటు విడిది


కొండదిగువ తొలిపావంచా స్వామికి పూజలు నిర్వహిస్తున్న లక్షీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం : ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ సోమవారం సింహగిరికి వచ్చారు. మూడు నెలలపాటు సింహగిరిపై ఉండి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సేవలందించను న్నారు. తన పరివారంతో సింహాచలం చేరుకున్న దాసుడు తొలుత కొండదిగువ తొలిపావంచా వద్ద శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సింహగిరికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తులసి ప్రసాదాన్ని అందజేశారు. తదుపరి సింహగిరిపై ఉన్న దాసుల సత్రానికి తరలి వెళ్లారు.

ఇదీ దాసుడి చరిత్ర

ఒడిశాలోని పట్టుపురానికి చెందిన దాసుల కుటుంబం తరతరాలుగా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సేవలో తరిస్తోంది. ఏటా వైశాఖ మాసం నుంచి మొదులుకొని సుమారు మూడు నెలలపాటు వీరు సింహగిరిపై ఉండి స్వామిని సేవించడం పరిపాటి. ఈ మూడునెలల్లో వీరి ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు సింహగిరికి తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటారు. ఈ మూడు నెలల్లో దాసుడు స్వామికి ఆర్జిత సేవలను విశేషంగా జరిపిస్తారు. లక్ష కుంకుమ పూజ, లక్ష తులసిపూజ, గరుడ సేవ, కోలాసేవ, నిత్య కల్యాణం, పుష్పాంజలి సేవలను ఘనంగా జరిపిస్తాడు. ఈసేవల్లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో ఒడిశా భక్తులు ఆయారోజుల్లో సింహగిరికి తరలివస్తారు. ఈ మూడు నెలలు వీరి రాకతో సింహగిరిపై సందడి నెలకుంటుంది. సింహగిరి నుంచి దాసుడు తిరుగు ప్రయాణమయ్యే రోజు నగదును మూటలుగా కట్టి ఆలయంలోని హుండీల్లో వేయడం పరిపాటి. ఈ నగదంతా పట్టుపురంలోని దాసుడి ఇంట్లో ఏర్పాటు చేసిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో అక్కడ భక్తులు సమర్పించినదే కావడం విశేషం. తన తండ్రి వనమాలికో దాస్ మరణానంతరం 2008 నుంచి లక్ష్మీకాంత్‌నాయకోదాస్ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సేవలందించే బాధ్యతలు స్వీకరించారు. దాసుడు బస చేసేందుకు సత్రం కూడా సింహగిరిపై ఉంది.

సర్కారు బడులకు మహర్దశ

- గిరిజన సంక్షేమ పాఠశాలలో అభివృద్ధి పనులు
- నాడు–నేడు ద్వారా రూ.65లక్షలతో అదనపు తరగతి గదులు, డైనింగ్, కిచెన్ నిర్మాణం
- విద్యార్థుల తల్లిదండ్రుల హర్షాతిరేకం


డైనింగ్‌హాల్ లేకపోవడంతో మండుటెండలో భోజనం చేస్తున్న విద్యార్థినులు(ఫైల్)


శిథిలావస్థకు చేరిన అదనపు తరగతి గదులు (నాడు)


అందుబాటులోకి రానున్న అదనపు తరగతి గదులు, డైనింగ్‌హాల్, కిచెన్ (నేడు)

అనంతగిరి: శిథిలావస్థలో భవనం..పూర్తిగా దెబ్బతిన్న పైకప్పు.. బీటలు వారిన గోడలు, గచ్చు..చినుకు పడితే తరగతి గదులన్నీ జలమయం..ఇది గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి.. చంద్రబాబు పాలనలో మన్యంలో ఒక్క పాఠశాల కూడా అభివృద్ధి జరగలేదు. శిథిల భవనాల్లోని..అరకొర సిబ్బందితో...విద్యాభ్యాసాలు జరిగేవి...గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ప్రైవేట్ విద్యకే ప్రాధాన్యమిచ్చారు..దీంతో నాడు విద్యావ్యవస్థ కుంటుపడింది..చదువుపై ఉన్న మమకారంతో సమస్యలతోనే గిరిజన విద్యార్థులు సావాసం చేశారు... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు బడులకు జీవం పోశారు. విద్యకు పెద్దపీట వేశారు..నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు... ఏజెన్సీలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి దర్శనమిస్తోంది.

అభివృద్ధి పనులు

మండల కేంద్రంలోగల గిరిజన సంక్షేమ బాలికల–2 పాఠశాల మొదటి విడత నాడు–నేడులో సుమారు 65 లక్షలతో అభివృద్ధి చేశారు. అదనపు తరగతి గదులు, డైనింగ్, కిచెన్ షెడ్డు లేకపోవడంతో విద్యార్థినిలు సమస్యలను గుర్తించిన, ప్రభుత్వం విద్యార్థినిలకు సౌకర్యం కల్పించేలా చొరవచూపింది. రూ.1.57 కోట్లతో అదనపు తరగతి గదులు, కిచెన్, డైనింగ్‌హాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దాదాపుగా 90శాతం పనులు పూర్తయ్యాయి. విద్యాసంవత్సరానికి విద్యార్థినిల సమస్యలు పరిష్కారం అవుతుండడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధి బాటలో నడుస్తుండడంతో గత ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు 310 మంది విద్యార్థిలు ఉండగా 150 మంది నూతన అడ్మిషన్లు జరిగాయి. మొత్తం 460 మంది వరకు విద్యార్థినిలు విద్యాభ్యాసం చేసేవారు.. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో విద్యార్థినిలు ఉత్తమ ఫలితాలను సాధించారు. ఈ ఏడాది మరింత అడ్మిషన్లు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు.

పెరిగిన అడ్మిషన్లు

గతం కంటే ప్రస్తుతం అడ్మిషన్లు పెరిగాయి. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఉంటున్నాయి. ఫలితంగా ఏటా విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరుతున్నారు. అభివృద్ధి పనులతో పాటు మెరుగైన బోధన అందుతోంది. సమస్యలు ఉంటే అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– మంగమ్మ, హెచ్‌ఎం, గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల–2, అనంతగిరి

న్యాణత ప్రమాణాలతో పనులు

నాబార్డులోని నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, కిచెన్, డైనింగ్‌హాల్ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపడుతున్నాం. ఎప్పుటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ విద్యాసంవత్సరానికి పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– గణేష్, ఏఈ, ట్రైబల్ వెల్ఫేర్ అనంతగిరి

లోతట్టు ప్రాంతాల జలమయం


వర్షానికి కూలిన షెడ్డు


రాజవొమ్మంగిలోని రోడ్డుపై చేరిన వర్షపు నీరు

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా సోమవారం భారీ వర్షం నమోదైంది. గత కొన్ని రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, పొలాల్లో చేరిన నీటిని రైతులు గట్లు వేసుకొని నిల్వ చేసుకుంటున్నారు. కాగా ప్రధాన రహదారులు, రోడ్లకు ఇరువైపుల చేరిన వరద నీటితో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మండలం మీదుగా జరుగుతున్న ఎన్‌హెచ్516ఈ రోడ్డు నిర్మాణ పనులు కారణంగా ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచి ఇబ్బందికర వాతావరణం నెలకొంది. మండలంలో సోమవారం అత్యధికంగా 34.0 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్‌వో) చైతన్య తెలిపారు. కాగా వరుసగా కురుస్తున్న వర్షాలకు మండలంలో తొలకరి వాతావరణం నెలకొంది.

వర్షం వేళ పిడుగులతో అప్రమత్తంగా ఉండాలి

అల్లూరి, ఉభయగోదావరి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా ఉరుములు మెరుపులతో కురుస్తున్న వర్షాలకు ఏక్షణాన్నైనా పిడుగులు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ ఎప్పటికప్పుడు ప్రకటనలు జారీ చేస్తోంది. ఈ సీజన్‌లో మామిడి, జీడిమామిడి తదితర తోటల్లోకి వెళ్లే రైతులు, కూలీలు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఈదురుగాలులకు రాలిన మామిడికాయల కోసం చెట్ల కిందకు వెళ్లొద్దని, ఆరుబయట ఉండవద్దని టీవీ, సెల్‌ఫోన్ల ద్వారా హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరించారు.

వర్షాలకు కూలిన షెడ్డు

గూడెంకొత్తవీధి: గాలివానకు గూడెంకొత్తవీధి మండలం దేవరాపల్లి పంచాయతీ లక్కవరం గ్రామంలో తాత్కాలికంగా నిర్మించిన పాఠశాల రేకుల షెడ్డు సోమవారం నేలకూలింది. గ్రామంలో విద్యార్థుల కోసం గ్రామస్తులు తాత్కాలికంగా నిర్మించిన షెడ్డులోనే జీపీఎస్ పాఠశాల కొనసాగుతోంది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఖాళీగానే ఉంది. సోమవారం వీచిన ఈదురుగాలులు, గాలివానకు షెడ్డు నేలకూలింది.


రాజవొమ్మంగిలో కురుస్తున్న వర్షం

అప్పన్న సన్నిధిలో ఏపీ జెన్‌కో ఎండీ


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న చక్రధరబాబు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

నేటి నుంచి సమ్మక్క సారక్క జాతర

ఎటపాక: గన్నేరుకొయ్యపాడులో సమ్మక్క సారక్క జాతర మంగళవారం నుంచి 23వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బాలరాణి, పూజారి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠంపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

స్వచ్ఛమైన పాల వెల్లువ

ప్రస్తుతం కల్తీ లేని ఉత్పత్తులు దొరకడం గగనంగా మారింది. ముఖ్యంగా పాల విషయంలో ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయి. అయినా నగరవాసులకు ప్రైవేట్ డెయిరీల పాల ప్యాకెట్లే దిక్కు. ఇది గ్రహించిన ఓ ముగ్గురు యువకులు కల్తీ లేని స్వచ్ఛమైన పాలు నగర ప్రజలకు అందిస్తే ఎలా ఉంటుందని ఆలోచించారు. వెంటనే రంగంలోకి దిగారు. సేంద్రియ విధానంలో సాగు చేయడం, ప్రజలకు దేశీ గోవు పాలు అందించడం లక్ష్యంగా ముందడుగు వేశారు. రోజూ విశాఖ నగరానికి దేశీ ఆవు పాలను తీసుకువచ్చి ఇంటికే సరఫరా చేస్తున్నారు. గత ఏడు నెలలుగా వారి ప్రయాణం నిర్విరామంగా సాగుతోంది. – ఏయూ క్యాంపస్

- సేంద్రియ సాగు.. దేశీయ క్షీరం
- విశాఖవాసులకు ఆరోగ్యకరమైన దేశీ పాలు సరఫరా
- డెయిరీ నిర్వహణలో ముగ్గురు యువకుల కొత్త మార్గం
- చోడవరం నుంచి నిత్యం నగరానికి ప్రయాణం

చోడవరం మండలం పొట్టిదొరపాలేనికి చెందిన వియ్యపు దుర్గారావు, పల్ల తాతారావు, దాలిబోయిన దుర్గారావు దేశీ ఆవులను పెంచే దిశగా అడుగులు వేశారు. సేంద్రియ వ్యవసాయంపై అవగాహన, దేశీ గోవులపై అభిమానం కలిగిన ముగ్గురూ హైదరాబాద్ నుంచి మంచి పాలను అందించే సాహివాల్, గిర్ జాతి ఆవులను కొనుగోలు చేసి తీసుకువచ్చారు. వీటితో పాటు మన ప్రాంతంలో లభించే ఒంగోలు, పుంగనూరు జాతి ఆవులను సైతం పెంచుతున్నారు. పాలను ప్రైవేట్ డెయిరీలకు కాకుండా నగరవాసులకు నేరుగా సరఫరా చేస్తే ఫలితం ఉంటుందని భావించారు. అలా నిత్యం విశాఖకు తీసుకువచ్చి సరఫరా చేయడం ప్రారంభించారు. తొలుత 10 లీటర్ల పాలు మాత్రమే విశాఖలో తమకు తెలిసిన వారికి అందించడం ప్రారంభించారు. శ్రీరాధాకృష్ణ గోశాల పేరుతో ప్రస్తుతం 60 కుటుంబాలకు 50 నుంచి 60 లీటర్ల వరకు నిత్యం పాలను సరఫరా చేస్తున్నారు. ఆటోలో పాలను తీసుకువచ్చి నగరంలో వినియోగదారుల ఇంటికే నేరుగా అందిస్తున్నారు. ఇద్దరు యువకులు గోవుల సంరక్షణ, గోగ్రాసం పెంచడంలో నిమగ్నమవుతున్నారు. మరొకరు నిత్యం నగరానికి పాలను తీసుకురావడం దినచర్యగా పెట్టుకున్నారు.

రోజూ 90 కి.మీ. ప్రయాణం

చోడవరం నుంచి నర్సీపట్నం వెళ్లే మార్గంలో ఉన్న పొట్టిదొరపాలెం నుంచి నిత్యం విశాఖకు పాలు సరఫరా చేస్తున్నారు. ఆటోలో నిత్యం 90 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. పాలను అర లీటరు చొప్పున ఇంట్లో ప్యాకింగ్ చేసుకుని నగరానికి తీసుకొస్తున్నారు. పాల ధరను సైతం అందరికీ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. లాభాల కోసం ఆలోచించకుండా ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. త్వరలో పూర్తి ప్రకృతి వ్యవసాయ విధానంలో ధాన్యం పండించడం, దాని నుంచి వచ్చే ఎండు గడ్డినే గోవులకు అందించే దిశగా అడుగులు వేస్తున్నారు.

ప్రజలకు చేరువ కావాలి..

ప్రజలకు మంచి ఆరోగ్యకరమైన దేశీ ఆవు పాలను అందించడం లక్ష్యంగా పని చేస్తున్నాం. కొంత శ్రమ ఉన్నప్పటికీ, నేలతల్లికి మేలు చేస్తూ, దేశీ గోవుల సంరక్షణ జరుగుతోందనే సంతృప్తితో ముందుకెళ్తున్నాం. ప్రజల నుంచి కూడా స్పందన బాగుంది. మరింత ఎక్కువ మందికి దేశీ ఆవు పాలను అందించాలనే ఆలోచనతో ఉన్నాం. త్వరలో చెక్క గానుగ నూనె సరఫరా కూడా ప్రారంభిస్తాం.

– వియ్యపు దుర్గారావు, రైతు
ఫోన్ : 7993542689


సేంద్రియ విధానంలో పెంచుతున్న గోగ్రాసం

సేంద్రియ పద్ధతిలో పశుగ్రాసం పెంపకం

దేశీ ఆవు పాలను మరింత ఆరోగ్యవంతంగా చేయాలని సంకల్పించారు. దీనిలో భాగంగా పశువులకు అందించే పచ్చిగడ్డిని సైతం సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారు. పశువుల గెత్తం ఎరువుగా వినియోగించి సూపర్ నేపియర్ గడ్డిని నాటారు. పొలంలో పూర్తిగా పశువుల గెత్తం వేసి, రెండు పర్యాయాలు నేలను దున్నిన తరువాత హైదరాబాద్ నుంచి నేపియర్ గడ్డి కణుపులు కొనుగోలు చేసి నాటారు. రెండో కోత వచ్చే సమయానికి ఒక్కో కణుపు నుంచి 30 నుంచి 35 వరకు గడ్డి పిలకలు వచ్చాయి. వీటిపై గోకృపామృతం పిచికారీ చేయడం, గడ్డి పెంచుతున్న సాళ్ల మధ్యలో జీవామృతం పారించడం చేస్తున్నారు. ఇలా పశుగ్రాసాన్ని సైతం ప్రకృతి విధానంలో సాగు చేస్తున్నారు.